నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

ఓడినా.. ప్రజల మధ్యనే ఉంటాం

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ ఇంచార్జ్ ఏనుగు రవీందర్‌రెడ్డి అత్యల్ప మెజార్టీతో ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ పనిచేస్తారని చందూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలకిషన్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మనోధైర్యాన్ని తెలుపుతున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను బాన్సువాడ నియోజకవర్గంలోని పేద ప్రజలకు అందేలా చూస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని కొన్ని మండలాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తమ స్వార్థాల కోసం పక్క నియోజకవర్గాల్లోని గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థుల వద్దకు వెళ్లి లోకల్‌లో ఉన్న ప్రజలకు మాత్రం ధైర్యం చెప్పలేని పరిస్థితిలో ఉండటం ఇది బాధాకరమని అన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీకి న్యాయం జరగాలంటే ఏనుగు రవీందర్‌రెడ్డితో ప్రజలకు దగ్గరగా ఉండాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత రెడ్డి, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దోమకొండ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద నుంచి ప్రధాన వీధుల గుండా డీజే పాటలతో గురువారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్రబోయిన స్వామి, పల్లె రామస్వామి గౌడ్, మధు, గోపాల్‌రెడ్డి, శంకర్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు దక్కని పదవి
- సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌కు అవకాశం ఇవ్వనున్నట్టు ప్రచారం
- రెండో విడుతలో వ్యవసాయశాఖ మంత్రిగా సుదర్శన్‌రెడ్డి..?


సుదర్శన్‌రెడ్డి


షబ్బీర్‌అలీ


ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్/కామారెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో 11 మంది మంత్రులు, స్పీకర్ ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి, షబ్బీర్‌అలీకి మంత్రివర్గంలో చోటులభిస్తుందని అంతా భావించినా తొలి విడుతలో వారి పేర్లు ఖరారు కాలేదు. అయితే మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించే అవకాశాలున్నట్టు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. సుదర్శన్‌రెడ్డికి వ్యవసాయశాఖ కేటాయించనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

బోధన్ ఎమ్మెల్యేగా నాలుగోసారి గెలుపొందిన పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మొదటి విడతలో మంత్రి పదవి దక్కుతుందని గత నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. కానీ గురువారం కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం వేళ నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఆయనతో పాటు 11 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మొదటి జాబితాలో మాత్రం పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయలేదు. దాంతో నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి వస్తుందా లేదా అంటూ సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి ఉన్నారు. దాంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమనే మాట వినిపిస్తోంది. ఎన్నికలలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అలాగే ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మదన్మోహన్ రావు సైతం మంత్రి పదవి రేసులో ఉన్నట్లు ప్రచారం సాగింది. అలాగే జుక్కల్ నుండి గెలుపొందిన లక్ష్మీకాంతరావుకు సైతం మంత్రి పదవి ఇవ్వాలని జుక్కల్ నియోజకవర్గ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మంత్రి పదవి ఎవరికి వరిస్తుందోనని కాంగ్రెస్ నాయకులు ఎదురుచూస్తున్నారు. గురువారం మంత్రివర్గ విస్తరణలో భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెూం శాఖ మంత్రిగా, దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా, తుమ్మల నాగేశ్వరరావు రోడ్లు భవనాల శాఖ మంత్రిగా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా, డి. శ్రీధర్ బాబు ఆర్థిక శాఖ మంత్రిగా, సీతక్క గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, జూపల్లి కృష్ణారావు పౌర సరఫరాల శాఖ మంత్రిగా, పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా, కొండా సురేఖ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బోధన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పొద్దుటూరు సుదర్శన్ రెడ్డికి తప్పనిసరిగా వ్యవసాయ శాఖ కేటాయిస్తారని దాంతో రైతుల సమస్యలు తక్షణమే పరిష్కారం అయ్యే అవకాశం ఉందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

రెండో విడతలో మంత్రి పదవి దక్కేనా..

మొదటి విడతలో 11 మంది ఎమ్మెల్యేలు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుండి మొదట విడతలో ఎవరికి మంత్రిగా అవకాశం రాకపోవడంతో రెండో విడతలనైన మంత్రి పదవి జిల్లాకు దక్కేనా అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో సీనియర్ మాజీ మంత్రిగా ఎమ్మెల్యేగా ఉన్న పొద్దుటూరు సుదర్శన్ రెడ్డికి రెండో విడతలో కచ్చితంగా మంత్రి పదవి దక్కుతుందని జిల్లా వాసులు ఆశిస్తున్నారు. ఆయనకు మంత్రి పదవి వచ్చినట్లయితే జిల్లాలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతాయని, జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజల ఆశిస్తున్నారు. ఆయనకు వ్యవసాయ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతుంది.

షబ్బీర్‌అలీకి మంత్రి పదవి వరించేనా..?

కామారెడ్డి : ఇటీవల వరకు షబ్బీర్ అలీకి మైనార్టీ కోట కింద మంత్రి పదవి వస్తున్నట్టు ఊహాగానాలు వినిపించినా.. తొలి విడుతలో పేరు ఖరారు కాలేదు. అయితే మంత్రి పదవి వరించేనా..? అని చర్చలు జరుగుతున్నాయి. ఆయన పదవికి ఆయన తమ్ముడుతో పాటు అనుచరుల తీరు అడ్డుపడనున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో షబ్బీర్ అలీ గెలిచే అవకాశాలు ఉండగా.. ఆయన అనుచర వర్గం బైక్‌లపై తిరుగుతూ కామారెడ్డి పట్టణంలో హల్‌చల్ సృష్టించారు. దీంతో పట్టణ కేంద్రంలో పలువురు ఓటర్లు భయబ్రాంతులకు గురైయ్యారు. కేవలం 4500 ఓట్ల తేడాతో ఓటమిచెందారు. ఈసారి ఎన్నికల్లో అధిష్టానం సూచన మేరకు నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో నిలిచి ఓడిపోయారు. అయినా అధిష్టానం ఆయనను గుర్తించి మంత్రి పదవి ఇస్తారని అంతా భావించారు. కానీ ఇటీవల షబ్బీర్‌అలీ తమ్ముడు నయీం.. మాచారెడ్డి ఎంపీటీసీ ఎంపీటీసీ రావుల వినోద ప్రభాకర్‌కు ఫోన్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో ఆ ఆడియో వాట్సాప్‌లో హల్చల్ కావడం వివిధ పత్రికల్లో, యూట్యూబ్లో వార్తలు రావడంతో ఇప్పుడు అతనికి పదవి వస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగానే మారింది. షబ్బీర్ అలీ మంచితనాన్ని గుర్తించుకుంటున్న ఓటర్లకు మాత్రం అతని వెనుక ఉన్న నయీమ్ వారి అనుచరులతో భయం పట్టుకుంది. షబ్బీర్ అలీ మంత్రి పదవి రాకముందే అతని తమ్ముడు అలా మాట్లాడితే షబ్బీర్ అలీ మంత్రి అయితే అతని తమ్ముని ఎలా ఉంటుందని ఇప్పటినుంచే నియోజకవర్గంలో చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం తమ నాయకుడైన షబ్బీర్ అలీ కి మంత్రి పదవి వస్తుందని ఇప్పటికీ ఆశలోనే ఉన్నారు. నయీమ్ తొందర పడకుంటే షబ్బీర్ అలీకి మంత్రి పదవి వచ్చేదేనని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.


పైడి ఎల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సమావేశమైన జడ్పీటీసీలు

జడ్పీటీసీలతో మంతనాలు

- పీఠం కదలకుండా రాజీకుదిర్చే ప్రయత్నం

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్

కామారెడ్డి జడ్పీటీసీలు రహస్య మీటింగ్ పెట్టుకోవడం జిల్లాలో హాట్‌టాపిగ్గా మారింది. పార్టీలకతీతంగా జడ్పీటీసీలందరూ బుధవారం తాడ్వాయి మండలం సోమార్ పేట తండాలోని పైడి ఎల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రహస్య సమావేశమై పాలకవర్గంపై అవిశ్వాస తీర్మానంపై చర్చించిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయం పత్రికల్లో రావడంతో, పాలకవర్గం అలర్ట్ అయింది. జెడ్పి పీఠం కదలకుండా, పలు జెడ్పిటిసిలను రాజీ ప్రయత్నం కుదురించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. 2019లో జిల్లాలోని 22 మండలాల జడ్పిటిసిలకు ఎన్నికలు నిర్వహించగా 14 జెడ్పిటిసి స్థానాలను బీఆర్ఎస్ కైవాసం చేసుకోగా, 8 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. జెడ్పి చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి డి రాజు శోభను ఎన్నుకోగా, వైస్ చైర్మన్‌గా ప్రేమ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి పాలకవర్గంపై ఉన్న వ్యతిరేకత, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే బయటపడింది. పార్టీ మారుదామా లేకుంటే అవిశ్వాస తీర్మానం పెడదామనే అంశంపై చర్చించుకున్నట్టు తెలిసింది.

సెక్రటేరియట్‌లో జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మీ కాంతారావు మొట్టమొదటిసారిగా సెక్రటేరియట్‌లోకి అడుగుపెట్టారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకార అనంతరం ప్రగతి భవన్‌కు, అటునుంచి అటు సెక్రటేరియట్‌కు ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి సందర్శించి వచ్చారు.


రాష్ట్ర సచివాలయం వద్ద జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

ఫూడ్‌పాయిజన్..

- 16 మంది విద్యార్థులకు అస్వస్థత



నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని బోర్గం(పి) ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురైయ్యారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురి కావడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వారంతా నాలుగు, ఐదు తరగతికి చెందిన విద్యార్థులున్నారు. మధ్యాహ్న భోజనం తినడం వల్ల జరిగిందా.. లేక బయట ఏదైనా తినుబండారాలు తినడం వల్ల జరిగిందా అని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పిల్లలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. స్కూల్‌లో మొత్తం సుమారు 200 మంది ఉన్నారు. అయితే వీరిలో సుమారు 70 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయగా మిగతా పిల్లలకు ఏమీ కాలేదని, 16 మంది అస్వస్థతకు గురైనట్టు ఉపాధ్యాయులు తెలిపారు.

దేశ రక్షణకు సాయుధదళాల శ్రమ వెలకట్టనిది

- సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, వారి కృషి వల్లే మనమంతా ప్రశాంత వాతావరణంలో దైనందిన జీవనాలు వెళ్లదీస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది జిల్లా పాలనాధికారి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో పాటు కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ, వారి పట్ల, వారి సేవల పట్ల గౌరవ భావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి రమేష్, కెప్టెన్ బాబురావు, సుబేదార్ రామేశ్వర్, మల్కిట్ సింగ్, ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్, దివాకర్ రెడ్డి, ఎన్ సీ సీ క్యాడెట్లు, సైనిక్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు టి.వీరేశం ఆధ్వర్యంలో సైనికులను ఘనంగా సన్మానించారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్


సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీలో కలెక్టర్

జీవన్‌రెడ్డిమాల్‌కు నోటీసులు

- రూ.7 కోట్ల అద్దె బకాయిలు చెల్లించాలని టీఎస్‌ఆర్టీసీ నుంచి నోటీసులు
- రూ.2.5 కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌తో కరెంట్ సరఫరా నిలపివేత


అనౌన్స్ చేస్తున్న అధికారులు



నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డికి చెందిన జీవన్‌రెడ్డి మాల్‌కు గురువారం నోటీసులు వచ్చాయి. అద్దె బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ అధికారులు, విద్యుత్‌బకాయిలు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు నోటీసులు జారీ చేసి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వారిని ఖాళీ చేయాలని అనౌన్స్ చేయడం కలకలం రేపింది.

వివరాలు మెయిన్‌లో..

హామీలు అమలుకు పోరాడుతాం

- ఇది చిన్న విరామం మాత్రమే.. ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్

ఎన్నో అబద్దపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అయోమయానికి గురి చేసి గద్దెనెక్కిందని, హామీల అమలుకు శుక్రవారం నుంచే కౌంట్‌డౌన్ షురూ అయ్యిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలన్నీ మార్చి ఏడో తారీఖు వరకు నెరవేర్చాలని, లేదంటే వెంటాడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా మూడవ సారి ఎన్నికైన తర్వాత మొదటి సారి నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా ఆయనకు గురువారం వేల్పూర్ ఎక్స్ రోడ్ వద్ద కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తండ్రి క్రీస్తు శేషులు వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి పూలమలతో నివాళి అర్పించి తదనంతరం కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వేల్పూర్ బయలుదేరారు. వేల్పూర్‌లోని తన నివాసంలో తనను కలిసేందుకు పెద్ద ఎత్తున వచ్చిన బీఆరెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు.

'తెలంగాణ రాష్ట్రాన్ని పదిహేను సంవత్సరాల పాటు సుదీర్ఘ పోరాటం చేసి తీసుకొచ్చిన పార్టీ మనది. అలా సాధించుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టారు. డెబ్బై లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు అతికష్టంగా పండే మన తెలంగాణలో ఈరోజు మూడు కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించే స్థాయికి తెలంగాణను కేసీఆర్ తీసుకువెళ్లారు. ఏ ఊరు చూసిన, ఏ గల్లీ చూసినా అనేక మార్పులు, యాభై ఏండ్లలో చేయని అభివద్దిని తొమ్మిదిన్నర ఏండ్లలో చేసి చూపిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

రేపటి నుంచి కౌంట్ డౌన్ స్టార్ట్, తొంభై రోజుల్లో మార్చి ఏడో తారీఖులోపల రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కౌలు రైతులకు కూడా చేస్తామన్నారుని గుర్తు చేశారు. మహిళలకు బస్సు ఫ్రీ అన్నరు.. కరెంటు బిల్లు కూడా కాంగ్రెసే కడతదన్నారు, లక్ష కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం, సిలిండర్ ఐదొందలన్నారు. రేపటి నుంచే అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. ఇది కొంచెం విరామం, స్పీడ్ బ్రేకర్ మాత్రమే ఇంతకు రెట్టింపు వేగంతో వెళ్తామన్నారు. హామీలు జరుగుతున్నవా లేదా ప్రజల్లో చర్చకు పెట్టాలని, యాక్టివ్‌గా ఉండాలన్నారు. అధర్మం తోటి, మోసంతోటి, అన్యాయంతోటి ఓట్లు వేయించుకున్నోళ్లు ఎక్కువ కాలం ఉండరని, కొద్ది రోజులు వెయిట్ చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.


మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

పట్టుపెంచుకున్నాకే పల్లెపోరు?

- కొత్తసర్కార్ ఒకే అంటేనే జీపీ ఎన్నికలు
- లేకుంటే ప్రత్యేకాధికారుల పాలనలో జీపీలు
- ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- బీఆర్ఎస్‌లో ఉండటమా? లేదంటే అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లడమా?
- అంతర్మథనంలో ప్రస్తుత సర్పంచ్‌లు... ఆశావహులు



నవతెలంగాణ-నిజామాబాద్

పంచాయతీల పాలకవర్గం గడువు తేదీ వచ్చే ఏడు ఫిబ్రవరితో ముగియనున్న విషయం విధితమే. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గడువు ముగియడం కంటే రెండు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే కొత్త ప్రభుత్వం పచ్చజెండా ఊపితేనే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. లేకుంటే ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెల్లో పాలన కొనసాగనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ఇంకా గ్రామీణ స్థాయిలో పట్టు పెంచుకోవాల్సి ఉంది. పట్టుపెంచుకోకుండా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే.. మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. దీంతో పట్టు పెంచుకునే వరకు ప్రత్యేకాధికారుల పాలనలో జీపీలను నడిపించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. ఇన్ని రోజుల పాటు ఎమ్మెల్యేలతో పాటు స్థానిక సంస్థల్లో ఆ పార్టే అధికారం చెలాయించింది. 9 నియోజకవర్గాలకు గాను ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగు స్థానాలు, బీజేపీ నాలుగు స్థానాలు కైవసం చేసుకోవడంతో బీఆర్ఎస్ కోటకు బద్దలు కొట్టినట్టయింది. బీఆర్ఎస్ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లూ బీఆర్ఎస్‌లోనే ఉన్న మెజార్టీ సర్పంచు లు సహజంగానే అధికారపార్టీలో చేరికతో ప్రయోజనం సహా పంచాయతీ ఎన్నికల్లోనూ ఈజీగా గెలువొచ్చనే భావనలో ఉన్నారు. పైగా కాంగ్రెస్‌కు గ్రామస్థాయిలో ఇంకా శ్రేణులు, పల్లె పోరులో ఆశావహులు, ఇతర పార్టీల నుంచి వలసలు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి క్లారిటీ రాలేదు.

ఈ నేపథ్యంలో రెన్నెళ్లలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసే నాటికి ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించగా.. అది కార్యచరణ రూపందాల్చే పరిస్థితి కష్టమనే సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్... పల్లెలనూ గెలుచుకునేందుకు కొన్నినెళ్లపాటు ప్రత్యేకాధికారుల పాలన పెట్టే అవకాశాలు ఉన్నాయి.

తేలాల్సిన రిజర్వేషన్లు.. పెరగనున్న ఓటర్లు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలుండగా, కామారెడ్డి 525 జీపీలు ఉన్నాయి. గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కోటా రిజర్వేషన్లు ఖారారు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటితో సర్పచ్‌ల పదవీకాలం ముగియనుండగా.. ఆర్టికల్ 2(4)(3) ప్రకారం సర్పంచ్‌ల పదవీకాలం ఐదేండ్లు, పంచాయతీరాజ్ యాక్ట్ 14(2) ప్రకారం పదవీకాలం ముగియకముందే రెండునెలల ముందే ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి ముందస్తుగానే సమాచారం ఇస్తుంది. ఈ క్రమంలోనే ఆయా జిల్లా కలెక్టర్లకు ఈనెల 6న ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల సమయానికి రిజర్వేషన్లతో సహా ఎన్నికల తేదీలనూ ప్రకటించాల్సి ఉండగా అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఎన్నికల ఏర్పాట్లు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు కూడా మరింత ఆలస్యానికే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం లేకపోలేదు. ఫిబ్రవరి 1తరువాత ప్రత్యేక అధికారులను నియమించి కొన్నెళ్లపాటు పాలన సాగించి గ్రామస్థాయిలో పార్టీ పరిస్థితులు చక్కబడ్డాకే కాంగ్రెస్ సర్కారు ఎన్నికలకు పోయే అవకాశం ఉన్నట్టు చర్చసాగుతోంది. ఇదే జరిగితే పల్లెల్లో ఏయే రిజర్వేషన్లు ఖరారు అవుతాయనే అంచనాతో ప్రస్తుత సర్పంచ్‌లు, ఆశావహులు లెక్కలు వేసుకునే పనిలో పడుతున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

అంతా మొబైల్, టీవీల్లోనే

• సీఎం ప్రకటించే అంశాలకోసం ఆసక్తి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలోని ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా గురువారం ప్రతి ఒక్కరు మొబైల్, ఆన్లైన్, టీవీలు చూశారు. ఎటువంటి ఆసక్తికరమైన అంశాలను ఆయన మాట్లాడుతారా అని వేచి చూశారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎక్కడున్నవారు అక్కడే ఫోన్లు, టీవీలు చూస్తు ఉండిపోయారు. ఇప్పటివరకు నిరంకుశ పాలన, నియంతృత్వపాలన కొనసాగిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా నిరంకుశత్వం విడనాడి, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుతమైన పరిణామాలు కొనసాగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రజలకు సేవ చేసే విధంగా ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నారు.

చేపూర్ సాయిబాబా ఆలయంలో అన్నదానం



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ దత్త సాయి ఆలయ సన్నిధానంలో గురువారం అన్నదాత వేల్పూర్ మండలంలోని కుకునూర్ కోమన్ పల్లి గ్రామానికి చెందిన గటడి శ్రీనివాస్ - కవిత కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఈ సందర్భంగా దంపతులను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసి బాల నర్సయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, అధ్యక్షులు, కోశాధికారి సురేష్ రుక్మాజీ మాట్లాడుతూ... అన్నదానం చేయాలనుకున్న భక్తులు ఆలయ కమిటీ వారికి 6వేల రూపాయలు చెల్లిస్తే వారిపేరు అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ ది పాఠశాలలో ఆరెంజ్ కలర్స్ డే



ఆరెంజ్‌డేలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్ నందు గురువారం ఆరెంజ్ కలర్ డే సెలబ్రేషన్ సంబురంగా నిర్వహించారు. చదువుతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ముందుంటున్నారని కరస్పాండెంట్ షబానా గోహర్, డైరెక్టర్ రఫీ గోహర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



వేలాడుతున్న తీగలు

నవతెలంగాణ-సిరికొండ

ట్రాన్స్ కో అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ ఫోటో

సిరికొండ మండల కేంద్రం పోలీస్ స్టేషన్ గేట్ ముందరే విద్యుత్ వైర్లకు తీగలు పారుతున్నాయి. పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక లైన్ మెన్‌కి తెలియజేసిన స్పందన లేదని గ్రామస్తులు అంటున్నారు. పోలీస్ స్టేషన్ సీసీ కెమెరా, వీధి దీపాలకు అడ్డుగా తీగలు పెరిగి అంతరాయం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. పైన 11కేవీ వైర్లు ఉన్నాయని వెంటనే ట్రాన్స్ కో అధికారులు స్పందించాలని గ్రామస్థులు వాపోయారు.

నలంద పాఠశాలలో రెయిన్ బో డే సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద ప్రీ స్కూల్లో గురువారం రెయిన్ బో డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంద్రధనస్సులో ఉన్న రంగురంగుల దుస్తులతో ఈ కార్యక్రమంలో అలరించారు. విద్యార్థులకు రంగుల పట్ల అవగాహన కల్పించడం కోసం, రంగుల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడం, ఏ రంగు ఏ సంకేతాన్ని తెలియజేస్తుందో వివరించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి వారి జీవితాన్ని రంగులమయం చేసుకునేలా వారిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రీస్కూల్ ఉపాధ్యాయునులు ఫాతిమా, అయేషా,, అరుంధతి,శ్రావణి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వేముల



పెళ్లి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నియోజకవర్గంలోని పలువురు ఆత్మీయుల కుటుంబ సభ్యుల వివాహాది శుభాకార్యాలకు బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలో మోతె సత్యం కూతురు వివాహం, కమ్మర్ పల్లి శివారులోని లలిత గార్డెన్ లో జరిగిన మోర్తాడ్ ఎంపిపి శివలింగ శ్రీనివాస్ బంధువుల వివాహం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. జక్రాన్ పల్లి మండల కేంద్రంలో జరిగిన వేల్పూర్ భోజన్న కూతురు వివాహం, పెర్కిట్ లోని శ్రావణ్ గార్డెన్‌లో మోర్తాడ్ సొసైటీ చైర్మన్, తిమ్మాపూర్ బద్దం అశోక్ రెడ్డి చెల్లెలి కూతురు వివాహం, బాల్కొండ లోని ఎం.కే ఫంక్షన్ హాల్ లో బాల్కొండ మండలం నాగపూర్ సరికేల చిన్నయ్య కూతురు వివాహం, భూమరెడ్డి కన్వెన్షన్‌లో మూడెడ్ల జితేందర్ కూతురు వివాహ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కృషితోనే కాంగ్రెస్‌కు అధికారం

• ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు
• సంబరాల్లో కాంగ్రెస్ నేతలు



బాల్కొండలో



భీంగల్‌లో...

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండలంలోని నాయకులు గురువారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. హైదరాబాదులోని లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి మండల పార్టీ అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సుంకేట రవి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొలువు తీరనున్న ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి, ప్రజల మనలను పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. వెళ్లిన వారిలో నాయకులు బుజ్జి మల్లయ్య, సుంకేట బుచ్చన్న, సుంకేట శ్రీనివాస్, ఉట్నూర్ ప్రదీప్, కార్యకర్తలు ఉన్నారు.

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి సారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం నిరంతరం కృషి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం రెడ్డి, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, ముస్కు ముత్తెన్న, ఏలేటి విజయ్, ఏలేటి రాములు, మల్లారెడ్డి, సాజిత్, గోపి యాదవ్, లోక సుభాష్, అబ్రార్, నేర బాబూరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో కిసాన్ నగర్, బాల్కొండ, వన్నెల్ (బి) చౌరస్తా వద్ద డీజే ఏర్పాటు చేసి, టపాకాయలు కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. సంబరాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. జక్రాన్ పల్లి గ్రామం నుంచి కాటిపల్లి నర్సారెడ్డి, జైడి మల్లేష్, నారెడ్ల సాయి రెడ్డి తదితరులు వెళ్లారు.

మోపాల్: కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండలంలోని నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాయి రెడ్డి మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలంగాణ ఇచ్చింది.. తెలంగాణ తెచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు సమన్యాయం జరుగుతుందని, మొన్నటి వరకు ప్రగతి భవన్ కి ఎమ్మెల్యేలే వెళ్లేవారు కాదని, ఇప్పుడు సామాన్యుడు కూడా వచ్చే విధంగా రేవంత్ రెడ్డి పాలన ఉంటుందని అన్నారు. నిన్నటి నుండే సచివాలయంలో గేట్లను కూలగొడుతున్నారని, ఇది రేవంత్ రెడ్డి నైజం అని, రేవంత్ రెడ్డి సహకారంతో మన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కూడా ప్రజలకు సముచిత న్యాయం చేస్తాడని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భూపతిరెడ్డి అని అన్నారు.

భీంగల్: తెలంగాణ రాష్ట్ర సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుడు స్వామి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ మీదుగా భీంగల్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొది రే స్వామి, పట్టణ అధ్యక్షుడు జె జె నరసయ్య, నాయకులు కుంట రమేష్ ,అనంతరావు, సురేష్ గోపాల్ ,నాయక్ రాజు, నాగేంద్ర మహేష్ మరి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కార్యకర్తల కష్టంతోనే గెలుపు

• ఏర్గట్ల సెంటిమెంట్ ఫలించింది
• కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్



జెండా ఎగురవేస్తున్న నాయకుల, పాల్గొన్న కార్యకర్తలు

నవతెలంగాణ-ఏర్గట్ల

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినందున గురువారం మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గల కాంగ్రెస్ జెండాను ఎగురవేసి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టం ఫలితంగానే ప్రభుత్వం ఏర్పడిందని, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు భయపడకుండా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేశారని అన్నారు. అలాగే ఏర్గట్ల సెంటిమెంట్ పనిచేసిందని, అందువల్లనే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత రేవంత్ రెడ్డి ఏర్గట్లకు మా కోరిక మేరకు ఏర్గట్లకు వచ్చాడని, సెంటిమెంట్‌తో ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా, ప్రింట్ మీడియాలో ప్రచారం అవుతుందని అన్నారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి ఏర్గట్లకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి కావాలని చెట్టుకు ముడుపు కట్టామని, ఆ ముడుపును విప్పి ఏర్గట్ల గ్రామాన్ని, మండలాన్ని, సీఎం రేవంత్ రెడ్డి దత్తతకు తీసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ చీఫ్ విప్ ఈరవత్రి అనిల్ సీఎం దృష్టికి తీసుకువెళ్తారని ఏర్గట్ల బిడ్డగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నానన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడేం గంగాప్రసాద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు సర్వశక్తులు ఒడ్డారని, ప్రభుత్వం రాకతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయని, కచ్చితంగా ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు దేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, కార్యకర్తలు గడ్డం జీవన్,రేండ్ల రాజారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, మునీర్, దండేవోయిన సాయికుమార్, కురాకుల బొర్రన్న, రొక్కెడ చిన్న సాయన్న, ఇందూరు పెద్ద సాయన్న, మునిమాణిక్యం అజయ్, తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్ :సంబరాల్లో పాల్గొన్న నాయకులు



హైదరాబాద్ వెళ్తున్న కమ్మర్‌పల్లి నాయకులు



జక్రాన్‌పల్లి :సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి వెళ్లిన నాయకులు

ఘనంగా అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో అయ్యప్ప సేవాసమితి, గురు స్వామి సొడల వినోద్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి అరట్టు ఉత్సవ ర్యాలీని స్వాములు గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప విగ్రహాన్ని వాహనంపై వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. మాలధారులు భక్తి పాటలతో భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. మహిళలు మంగళహారతులతో అయ్యప్పకు స్వాగతం పలికి పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి దీక్షాపరులు స్వామివారి అరట్టు శోభాయాత్రలో పాల్గొన్నారు. స్వామికి ఆలయంలో దూప, దీప, నైవేద్యాలు సమర్పించి వినోద్ గురుస్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం అన్నదానం నిర్వహించారు

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ వారు 410417 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది అని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ఎస్ జగదీష్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకెపి, సొసైటీలు, మెప్మా మార్కెట్ కమిటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 63133 మంది రైతుల దగ్గర నుండి, ప్రభుత్వ కనీస మద్దతు ధర 2203తో కొనుగోలు చేశామని చెప్పారు. ఐకెపి 57 సెంటర్లు సొసైటీలు, డిసిఎంఎస్ 374 సెంటర్లు, మెప్మా 5 సెంటర్లు, మార్కెట్ కమిటీ 4 సెంటర్లు ద్వారా 440 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని వివరించారు. 55732 మంది రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించామని, 7401 మంది రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉందని అన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి తమ ఖాతాల్లో డబ్బులు చెల్లిస్తున్నామని సూచించారు.

సెమిస్టర్ పరీక్షల ఫీజుకు 12వరకు గడువు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని పీ. జీ.పరీక్షల నోటిఫికేషన్ ఫీజు తేదీని గురువారం విడుదల చేశారు. ఎంఏ. ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సి, ఎంకామ్, ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం, ఐదు సంవత్సరాల ఏపిఈ, పిసిహెచ్, ఐఎంబీఏ కోర్సులకు మూడవ, ఐదవ, ఏడవ, తొమ్మిదవ, రెగ్యులర్ పరీక్షలకు ఫీజు డేట్‌ను ప్రకటించారు. ఫీజు చెల్లించుటకు చివరి తేదీ ఈనెల 12 వరకు, వంద రూపాయల అపరాధ రుసుంతో 15 వరకు గడువు ఉటుందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్లో పొందుపరిచినట్టు తెలిపారు.

దొంగతనం కేసు నమోదు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఏడు మాసాల బంగారం ఒక కెమెరా చోరీ అయినట్టు జక్రాన్ పల్లి ఏఎస్ఐ సుశీల్ కుమార్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని దామర కృష్ణ అనే ఆటో డ్రైవర్ ఇంటి తాళం పగలగొట్టి బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న ఏడు మాసాల బంగారం, కెమెరా దొంగిలించుకుని పారిపోయారని అన్నారు. కృష్ణ మూడు రోజుల క్రితం పచ్చల నడకుడ గ్రామానికి కుటుంబ సభ్యులతో సహా వెళ్లారు. బుధవారం ఉదయం కృష్ణ అన్న తాళం పగలగొట్టి ఉండడం గమనించి కృష్ణకు తెలిపారు. వచ్చి చూసేవారికి దొంగతనమైనట్టు తెలిసింది. కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వేసినందుకు కృతజ్ఞతలు

ఇంటింటికీ వెళ్లి చెప్పిన బీజేపీ నాయకులు
వినూత్నంగా ప్రచారం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రతి ఒక రాజకీయ నాయకుడు ఎన్నికల వేళ మా పార్టీకి ఓటు వేయండి.. మా పార్టీ అభ్యర్థిని గెలిపించండి అంటూ ప్రచారాన్ని కొనసాగిస్తూ ముందుకు వెళ్లారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రతి ఇంటికి వెళ్లిన బీజేపీ పార్టీకి ఓటు వేయండి అని ఎలా అడిగారో అదేవిధంగా పార్టీ అభ్యర్థి గెలిచిన తర్వాత నగరంలో 28 డివిజన్‌లో బిజెపి నాయకులు, స్థానిక కార్పొరేటర్ ఇల్లందుల ప్రభాకర్, మమత ప్రతి ఇంటికి వెళ్లి, మీరు మా అభ్యర్థికి ఓటు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు అంటూ. ఇలా వినూత్నంగా కార్యక్రమం చేపట్టారు. ఈ విధంగా వచ్చి కలవడంతోపాటు, మా సమస్యలను కూడా ప్రతి ఇంటికి వచ్చి తెలుసుకొని, కాలనీల్లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించి, ముందుకు వెళితే ఇంకా బాగుంటుందని ప్రజలు అంటున్నారు. మునుముందు ప్రతి ఇంటికి వచ్చి కాలనీలో ఉన్న సమస్యలను తెలుసుకోవాలని కోరుకున్నారు.



ఇంటికెళ్లి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ సిబ్బంది



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాటిపల్లి వెంకటరామారెడ్డిని గురువారం కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పూల బోకేను అందించి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 08.12.2023 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పోసానిపేట విద్యార్థులు



నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ విద్యార్థులు ఎంపికైనందుకు గురువారం సర్పంచ్ మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. చెంచు శిరీష, కామటి సాత్విక, నిహారిక, కామటి గాయత్రి, తోకల సాయి ప్రియ, తుత్తుల సందీప్ ఎంపికయ్యారు. ఈ నెల 8, 9, పదో తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్నందున వారిని అభినందించారు. జాతీయస్థాయికి ఎంపిక కావాలని మహేందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం.. నామమాత్రం

- మండల సమావేశానికి అధికారుల స్థానంలో కిందిస్థాయి ఉద్యోగులు
- ఎన్నిసార్లు హెచ్చరించిన మారని అధికారులు తీరు

నవతెలంగాణ-బోధన్

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వం మండల పరిషత్ సమావేశాలను నిర్వహిస్తుంది. కానీ మండల సమావేశానికి పలుమార్లు అధికారులు వచ్చినట్లే వచ్చి వెళ్లిపోవడం, కొన్నిసార్లు నామమాత్రంగా హాజరవడం లాంటివి చేస్తున్నారు. కానీ గురువారం ఎంపీపీ బుద్దె సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి మండలస్థాయి అధికారుల స్థానంలో పలు శాఖలకు చెందిన కిందిస్థాయి ఉద్యోగులు హాజరై వారి నివేదికలను వివరించారు. గతంలో అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎంపీపీ బుద్దె సావిత్రి హెచ్చరించినా అధికారుల తీరులో మార్పు రావడం లేదు. గురువారం జరిగిన సమావేశంలో అధికారులు, కొంతమంది ప్రజాప్రతినిధులు మామూలుగా హాజరవడంతో సమావేశం గంటలో ముగించారు. మండల సమావేశానికి అధికారులు హాజరుకాకుండా కిందిస్థాయి ఉద్యోగులను పంపితే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. బెల్లాల్ గ్రామంలో ఉన్న కరెంటు సమస్యలు చెప్పడానికి ఇన్చార్జి సర్పంచ్ రాజు ప్రయత్నించగా.. ఆ గ్రామానికి సంబంధించిన విద్యుత్ శాఖ అధికారి స్థానంలో అదే శాఖకు చెందిన మరో అధికారి హాజరయ్యారు. దాంతో సర్పంచ్ సమస్య విన్నవించినా వినేవారు లేకుండా పోయారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారి హాజరు కావలసి ఉండగా ఏఈఓ హాజరయ్యారు. సమావేశానికి ఎప్పటిలాగే ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గైరాజరయ్యారు. మొత్తానికి సమావేశం నామమాత్రంగా కొనసాగింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు మండల సమావేశంలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటారు. కానీ ఈ సమావేశానికి అధికారులు సక్రమంగా హాజరు కాకపోవడంతో గ్రామీణ ప్రాంతంలో ఉన్న సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. దాంతో ప్రజాప్రతినిధులు, అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తప్పనిసరిగా మండల సమావేశాలకు హాజరవడం కాని, గ్రామస్థాయిలో పర్యటించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీవో పర్వన్న, ఎంపీఓ మధుకర్, ఎంఈఓ నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

వికలాంగుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

- జిల్లా సంక్షేమ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యాంగుల నుంచి వివిధ కేటగిరీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ మహిళ, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ శాఖ అధికారి వికలాంగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరుగబోయే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం-2023 సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పురస్కారాలను అందుకొనుటకు, వికలాంగుల నుంచి అర్హులైన వ్యక్తులు/సంస్థలు నుంచి దరఖాస్తులను ఆన్లైన్ వెబ్సైట్ wdsc.telangana.gov.in, https://forms.gle/xhYL9pxhKADzHvtp ఈ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ డిసెంబర్ 10, 2023 అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ - కామారెడ్డిని అన్ని కార్యాలయ పనివేలల్లో సంప్రదించాలని సూచించారు.

మొక్కజొన్న, శనగ పంటలో

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయాధికారి నరేష్



పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-గాంధారి

మొక్కజొన్న, శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నరేష్ అన్నారు. గురువారం మండలంలోని పోతంగల్‌కలాన్ గ్రామ పరిధిలోని మొక్కజొన్న, శనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నరేష్ మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు గమనించినట్టు తెలిపారు. అలాగే శనగలో ఎండు తెగులు గుర్తించామని, దీని నివారణ కోసం ట్రైకొ డర్మ విరిడే వాడడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శోయంబ్ అహ్మద్ రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏఈఓ..

సదాశివనగర్ : మండలంలోని ఉత్నూర్ శివారులో గురువారం వ్యవసాయ విస్తీర్ణ అధికారి శిరీష పంటలను పరిశీలించారు. మొక్కజొన్న, శనగ పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతంగా ఉందని తెలిపారు. కత్తెర పురుగు నివారణకు మందుల గురించి రైతులకు సూచించినట్లు తెలిపారు.



పంటలను పరిశీలిస్తున్న ఏఈవో

ఇల్లు దగ్ధమైన కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన పంపరి నరసింహులు అనే వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమవడంతో ఈ విషయాన్ని స్థానికులు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి సమాచారం అందించారు. వెంటనే స్పందించి ఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీబీపేట్ మండల వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్‌రెడ్డి, జనగామ మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సైదుగారి అశోక్‌గౌడ్, చిన్న మల్లారెడ్డి సర్పంచ్ ఆనందరావు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పి.ప్రతాప్‌రెడ్డి, పి.బుచ్చిరెడ్డి, ఆకుల బాబు, సుదర్శన్, సుశీల, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కామర్స్ గెస్ట్ లెక్చరర్ దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్, కామారెడ్డి నందు కామర్స్ సబ్జెక్టు బోధించుటకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక తెలిపారు. అర్హత కలిగిన, ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఈనెల 8వ తేదీన కళాశాలలో తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఇవ్వాలని సూచించారు.

దుబాయ్‌లో కల్వరాల్ యువకులు మృతి

- రోడ్డు ప్రమాదంలో ఘటన
- స్వగ్రామానికి చేరిన మృతదేహాలు

నవతెలంగాణ-సదాశివనగర్

దుబాయ్‌లో మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన యువకులు మృతి చెందారు. వీరిద్దరూ కారులో వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన మరో కారు వీరి కారును ఢీకొనడంతో ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన అంగూర్ ప్రశాంత్ (26), గుర్రపు రవి (25) ఈ నెల 3వ తేదీన దుబాయ్‌లో జాతీయ పండుగ రోజున స్నేహితుల దగ్గరికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు వీరి కారును ఢీకొనడంతో తీవ్రగాయాలై వీరిద్దరూ మృతిచెందారు. అయితే ఈ యువకులిద్దరూ దుబాయ్‌లో బైక్ రైడర్స్‌గా పనిచేస్తున్నారు. వీరి మృతిపట్ల అంగూర్ ప్రశాంత్ తల్లి తండ్రులు లక్ష్మీ, రాజు, గుర్రపు రవి తల్లి తండ్రులు గంగామణి రాజు కన్నీరుమున్నీరవుతున్నారు. కాగా వీరిద్దరికీ పెండ్లి కాలేదు. అందరితో ఆప్యాయంగా వీరిద్దరి మృతితో గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.



అంగూర్ ప్రశాంత్, గుర్రపు రవి (ఫైల్)

వివాహానికి ఎస్ఆర్ ఫౌండేషన్ ఆర్థికసాయం



నవతెలంగాణ-కామారెడ్డి

బిబిపేట్ మండల కేంద్రానికి చెందిన కూతురు లక్ష్మన్ కుమార్తె వివాహం ఉన్నందున వారి ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వారు ఎస్ఆర్ ఫౌండేషన్ (సుభాష్‌రెడ్డి) వారిని సంప్రదించగా ఎస్సార్ ఫౌండేషన్ వారు స్పందించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు ఎస్సార్ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ దేవునిపల్లి శ్రీనివాస్, జనగామ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సాయికుమార్, ఎస్సార్ ఫౌండేషన్ సభ్యులు పాత స్వామి, గణేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు

నవతెలంగాణ-గాంధారి

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు, ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సంఘని బాబా, బ్రాహ్మణపల్లి గణేష్, చంద్రకాంత్, డ్రైవర్ సాయిలు, కొనంటి సాయిలు, నేరేడు సాయిలు, నాగులూరు రాజు, శేఖర్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు

సామూహిక పడిపూజ

- అన్నదాన కార్యక్రమం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అయ్యప్ప సామూహిక పడిపూజ సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక పడిపూజకు గ్రామస్తులంతా హాజరుకావాలని అయ్యప్ప భక్తులు కోరారు. అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా కాంగ్రెస్ సంబురాలు

నవతెలంగాణ-లింగంపేట్/నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్/పిట్లం

తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి గురువారం లాల్ బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మండలంలోని ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున ప్రధాన కూడలి వద్దకు వచ్చి టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఆల్‌ఇండియా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పలువురు మహానేతల సమక్షంలో వేలాదిమంది కార్యకర్తల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పది సంవత్సరాల దొరల పాలనకు చరమగీతం పాడి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలపై వేలాదిమంది అభిమానులు కార్యకర్తల ముందు మొదటి సంతకం చేశారని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నారాగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎల్లమ్మ దురిశెట్టి అశోక్, డాక్టర్ రాజు, రఫీయొద్దీన్, బైరయ్య, ప్రసాద్, రామగౌడ్, సాయిరాం, సత్యనారాయణరెడ్డి, శంకర్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్ : ఉమ్మడి మండల కేంద్రంలోని మహమ్మద్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు మండలంలోని నాయకులు టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారని, ఇకపై బిఆర్ఎస్ నాయకుల అవినీతిని వెలికితీయడమే తమ పని అని ఆయన అన్నారు. అలాగే రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మొదటి సంతకం 6 గ్యారంటీలపై చేశారని ఆయన తెలిపారు. ఇకపై రాష్ట్రం మొత్తం అందరికీ సమపాలన అందించడమే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లోక్యనాయక్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీశ్రేణులు రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినందుకు మండలంలోని పెద్ద ఎత్తున బాణాసంచాలు కాల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టడం ఎంతో ఆనందంగా ఉందని, రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఫలితమే.. నేటి కాంగ్రెస్ పార్టీ హవా అని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కష్టపడ్డారని, ఆ కష్టానికి ఫలితమే ఈ అధికారమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే మడమ తిప్పదని ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తదన్న నమ్మకం ఉందన్నారు. ఆరు గ్యారెంటీల హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, విట్టల్, మారుతి, బాబుసింగ్, యువకులు, బాలరాజు, అనికేత్, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జంబిగే హన్మాండ్లు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డ రాజు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ చిప్ప శివ, మాజీ సర్పంచ్ హనుమ గంగారాం, ఏనుగండ్ల శ్రీనివాస్, మోహిన్, మైనార్టీ నాయకులు కరీం, యూసుఫ్, ముజ్జు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో..



పిట్లంలో..

అభివృద్ధి పనులకు తీర్మానం చేసిన ఎంపీపీ



అభివృద్ధి పనులపై తీర్మానం చేస్తున్న ఎంపీపీ తదితరులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో వివిధ అభివృద్ధి పనులకు తీర్మానం చేసినట్టు ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గ రెడ్డి తెలిపారు. జక్కాపూర్‌లో బోరు మోటర్, ఆరేపల్లిలో బీసీ కమ్యూనిటీ హాల్, మంగళూరు నర్సింగ్‌రావుపల్లిలో నీటి సమస్యకై పైప్‌లైన్ ఏర్పాటు, వడ్డేపల్లిలో ఐమాక్స్ లైట్, శనివార్‌పేటలో మురికి కాలువ ఏర్పాటు, అలాగే అచ్చంపేటలో మురికి కాలువ ఏర్పాటుకై ఎంపీపీ అధ్యక్షతన తీర్మానం చేశారు. ఈ పనులన్నింటికీ ఎంపీటీసీలందరూ తీర్మానం చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగేశ్వర్, నిజాంసాగర్ విద్యుత్ శాఖ ఏఈ, వివిధ శాఖల అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
4
నిజామాబాద్
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com

కేసీఆర్‌ను కలిసిన మగ్గరి హన్మాన్లు



నవతెలంగాణ- నవీపేట్
బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-బోధన్
బోధన్ ఎమ్మెల్యేగా నాలుగోసారి ఎన్నికైన పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో బోధన్ మున్సిపల్ చైర్మన్ దంపతులు తూము పద్మావతి, శరత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి
ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులను కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆయన స్వగృహంలో గురువారం అభినందించారు. ఈ నెల 5, 6వ తేదీన నల్గొండలో జరిగిన ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నిజామాబాద్ జిల్లా నుంచి అండర్-11 విభాగంలో హర్షిని బంగారు పతకం, అండర్-17 విభాగంలో శౌర్యసాయి బంగారు పతకం, శ్రీనిధి కాంస్య పథకం సాధించారు. నిజామాబాద్ జిల్లా నుండి హర్షిని, శౌర్య సాయి ఈ నెల 16వ తేదీన ఢిల్లీలో జరిగే నేషనల్ లెవెల్ ఎస్‌జిఎఫ్ కరాటే గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈ విజేతలను కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో జరిగే పోటీలో విజయం సాధించాలని సూచించారు.

ఉప్పల్వాయిలో రాష్ట్రస్థాయి గురుకుల క్రీడాపోటీలు

నవతెలంగాణ-రామారెడ్డి
మండ లంలోని ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి గురుకుల క్రీడాపోటీలు జరగనున్నట్లు ప్రిన్సి పాల్ ఎం.సత్యనా రాయణ గురువారం తెలిపారు. అథ్లెటిక్స్, కోకో, హ్యాండ్‌బాల్ పోటీల్లో 7జోన్లకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొననున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు

- తెలిపిన విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి అధ్యక్షులు



మాట్లాడుతున్న అధ్యక్షుడు

నవతెలంగాణ-కామారెడ్డి
నాంపల్లి నియోజకవర్గం నుంచి దివ్యాంగురాలు అయిన రజనీకి ఉద్యోగం ఇచ్చినందుకు విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూతన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి అధ్యక్షులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం 6 గ్యారెంటీలపై సంతకంతో పాటు నాంపల్లి నియోజకవర్గం నుండి వికలాంగురాలైన రజినీకి ప్రమణ స్వీకారం నాడు ఉద్యోగం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో వికలాంగులందరికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అధికారంలో ఉన్నందుకు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ దివ్యాంగుల సమాజం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ డైరెక్టర్ గాడి నర్సింలు పాల్గొన్నారు.

అస్వస్థతకు కారకులపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థులను పరామర్శిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
బోర్గం(పి) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అస్వస్థకు కారకులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం తినడం ద్వారా అస్వస్థకు గురైన విద్యార్థులను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కరర్క గణేష్ మాట్లాడుతూ, బోర్గం (పి) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడం ద్వారా అస్వస్థకు గురయ్యారని తెలిపారు. వారిని వెంటనే మంచి వైద్య సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. గత పాలకవర్గం కెసిఆర్ ప్రభుత్వం విద్యార్థులపై చిన్న చూపు చూశారని తెలిపారు. మరి కొత్త ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థులు అస్వస్థకు గురికావడానికి మధ్యాహ్న భోజన సంబందించిన కారకులపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం సంబంధించి సరిపడా నిధులు కేటాయించి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటువంటి సంఘటనలు జరగకుండా జిల్లా అధికారులు, ప్రభుత్వం కారాకులపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నాయకులు సందీప్, సలీం, అనిల్,సాయికిషన్,పవన్ లు పాల్గొన్నారు.

గోల్‘మాల్’



- జీవన్‌రెడ్డి మాల్ చుట్టూ రాజకీయం
- రూ. 7 కోట్ల బకాయిలు ఉండటంతో ఆర్టీసీ నోటీసులు జారీ
- విద్యుత్ బకాయిల దృష్ట్యా మాల్‌కు కరెంట్ కట్
- అయోమయంలో వ్యాపారస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్
ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్ రాష్ట్ర వ్యాప్తంగా హాట్‌టాపిగ్‌గా మారింది. బస్టాండ పక్కన ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకొని జీవన్‌రెడ్డి మాల్ నిర్మించగా.. అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్టీసీ హైద రాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం మాల్‌కు వచ్చి నోటీసులు అందజేశారు. అదే విధంగా రూ.2.5 కోట్ల విద్యుత్ బకాయిలు ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఒక్కసారిగా చర్చనీయాంశం అయింది.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి "విష్ణు జీత్ ఇన్ఫ్రా లిమిటెడ్" సంస్థ ఆధ్వర్యంలో నియోజక వర్గ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణ స్థలాన్ని లీజుకు తీసుకొని గతములో "జీవన్ మాల్" నిర్మించారు. అయితే గురువారం హైదరాబాద్ నుండి ఆర్టీసీ టాస్క్ ఫోర్స్ అధికారులు జీవన్ మాల్ పరిశీలించి లీజు బకాయిలు చెల్లించాల్సిందే అని బహిరంగంగా మైక్ ద్వారా అనౌన్స్ చెయ్యడమే కాకుండా అందులో ఉన్న దుకాణ సముదాయ యాజమానులకు జీవన్ మాల్ లో ఉన్న దుకాణాలను ఖాళీ చేయాలని లేనియెడల వారం రోజులలోపు జీవన్ మాల్ సీజ్ చేస్తామని హెచ్చరించరు.

రూ.7 కోట్ల బకాయిలు
మాజీ ఎమ్మెల్యే భార్య రజిత రెడ్డి పేరు పైన ఉన్న ఈ జీవన్ మాల్ బకాయిలు సుమారుగా ఏడు కోట్ల వరకు ఉన్నాయని అధికారులు వివరించారు. గత నెలలోనే డబ్బులు కట్టాలని హుకుం జారీ చేసినా సంబ ంధిత యజమానులు పెడ చెవిన పెట్టినట్టు అధికారులు తెలిపారు. అప్పుడే డిసెంబర్ మూడో తారీకు లోపు బకాయిలు కట్టకపోతే సీజ్ చేస్తామని టాక్స్ ఫోర్స్ అధికారులు తెలిపినట్లు ఆర్మూర్ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ పథ్విరాజ్ గౌడ్ విలేకరులతో తెలిపారు.



జీవన్ మాల్ విష్ణు జీత్ ఇన్ఫ్రా లిమిటెడ్ అనే కంపెనీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి పేరుపై కొనసాగుతుందని వివ రించారు. ఏదేమైనప్పటికీ జీవన్ మాల్‌లో ఉన్నటువంటి దుకాణాల యాజమానులు వారి ఫర్నిచర్ సామగ్రి వస్తువులను తీసుకొని వెళ్లాలని అధికారులు ఆదేశించారు. లేనియెడల జీవన్ మాల్ సీజ్ చేసినప్పుడు వారి వస్తువులు చెడిపోతాయని మానవత దక్పతంతో అధికారులు వివరించారు. ఉన్నత అధికారుల అదేశాను సారం మాత్రమే తాము పని చేస్తామని వివరించారు.

మాల్ కడుతున్నప్పటి నుంచి విమర్శలే
ఆర్టీసీ ప్రంగాణంలో లీజుకు తీసుకొని ఎమ్మెల్యే సతీమణి నిర్మాణ పనులు ప్రారంభించిన నాటి నుండి రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అప్పటి స్థానిక ప్రతిపక్ష నేతలు కొంత భయపడి విమర్శలు చేయనప్పటికీ ప్రతిపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆర్మూర్ వచ్చినప్పుడు కచ్చితంగా జీవన్ రెడ్డి మాల్ ప్రస్తావన తెచ్చి విమర్శించే వారు. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేగా జీవన్ రెడ్డి తనపై వచ్చిన విమర్శలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించి నష్టాలలో ఉన్న ఆర్టీసీ సంస్థ బకాయిలు చెల్లించే నైతిక బాధ్యతను విస్మరించడం శోచనీయం అని ప్రజలు చర్చించుకొంటున్నారు.

"ఎన్నికల ప్రచార అస్త్రం జీవన్ మాల్"
గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో ఆర్టీసీ స్థలంలో కట్టిన జీవన్ మాల్ బకాయిల విషయన్నీ ప్రచారాస్త్రంగా ఇతర పార్టీలు వాడు కున్నాయి. ఎన్నికల అయిపోయిన తర్వాత జీవన్ రెడ్డి ఓడిపోవడం రాకేశ్ రెడ్డి ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలవడం రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిపోయింది.

ఈ సందర్భంగా గురువారం ఆర్టిసి అధికారుల ప్రత్యేక బందం జీవన్ రెడ్డి మాల్ లోకి వెళ్లి బహిరంగంగా అనౌన్స్‌మెంట్ చేయడమే కాక నోటీసులు జారీ చేశారు. దీంతో ప్రతిపక్ష పార్టీ అయిన బిజెపి కార్యకర్తలు ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సూచనల మేరకే ఆర్టీసీ అధికారులు నోటీసులు ఇస్తున్నారని సోషల్ మీడియాలో వైరల్ చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాబట్టి అటు కేసీఆర్ కట్టిన ప్రగతి భవన్ కంచెలను బద్దలు కొట్టి.. ఇట్టి జీవన్ రెడ్డి మాల్ ను సీజ్ చేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా పాలన తెస్తున్నామని ఇంటర్నెట్లో వైరల్ చేస్తున్నారు. అయితే ఆర్టిసి అధికారులు మాత్రం ఉన్నతా ధికారుల ఆదేశాలే తమకు శిరోధార్యం అని వ్యాఖ్యానించారు. అయితే వారం రోజు లోపల జీవన్ రెడ్డి దంపతులు బకాయిలు చెల్లిస్తారా? లేక కోర్టు సాయం పొందుతారా?లేక సీజ్ అయ్యే విధంగా మొండిగా వ్యవహరిస్తారో లేదా ఆర్టీసీ బకాయి చెల్లిస్తారో లేదో నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వేణుమాల్, పివిఆర్ మల్టీప్లెక్స్ యజమాన్యంపై
చర్యలు తీసుకోవాలి

- తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
వేణుమాల్, పీవీఆర్ మల్టీప్లెక్స్ యాజమానం తొలగించిన వారిని వెంటనే వీధిలోకి తీసుకోవాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం లేబర్ కార్యాలయంలో ఏసీఎల్‌కి వేణు మాల్, పీవీఆర్ మల్టీప్లెక్స్ యజమాన్యంపై చర్యలను తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ..పివిఆర్ మల్టీప్లెక్స్‌లలో ఈ మధ్య తరచుగా మహిళల పట్ల అమానుషంగా వ్యవహరిన్నారన్నారు.

మహిళలని కూడా చూడకుండా తప్పు ఎత్తి చూపిన మహిళల పట్ల ట్రాన్స్‌ఫర్ అని వేధించడం ఈమధ్య పరిపాటిగా మారిందన్నారు. ఈ థియేటర్లలో సరైన మ్యాన్ పవర్ మెయింటెనెన్స్ ఉండదని, ఉన్న ఎంప్లాయీస్‌పై అధిక ఒత్తిడి ఉంటుందని తెలిపారు.

ఓవర్ టైం డ్యూటీ చేయిస్తూ దానికి ఎలాంటి ఎక్స్ట్రా వేతనం అనేది లేదని, పది నిమిషాలు లేటు వచ్చినా కూడా డ్యూటీలో నుంచి తీసివేయడం లేదా ఎంప్లాయిస్ ద్వారా లెటర్ రాయించుకోవడం చేస్తున్నారని తెలిపారు. శాలరీ పే స్లిప్స్ కూడా ఇవ్వడంలేదని, ఇంక్రిమెంట్స్ ఉండవని, ఇయర్లీ బోనస్ లేదని, డ్యూటీ మేనేజర్ మరియు సినిమా మేనేజర్ వాళ్లకు నచ్చినట్టుగా వ్యవహరిస్తుంటారని అన్నారు. వీరిపై వెంటనే చర్యలను తీసుకోవాలని. తొలగించిన మహిళలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండు శైలజ, గౌరు, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ అనుకున్నా.. కానీ కోరుట్ల నుంచి పోటీ చేశా

- ఓడినా బలం పెంచుకున్నాం: ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
'నేను ఎమ్మెల్యేను కాదు. అధిష్టానం ఆదేశం మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేశానని' ఎంపీ అరవింద్ వెల్లడించారు. ఆర్మూర్ ప్రాంతంలో ఎమ్మెల్యే నిలబడటం కంటే కోరుట్లలలో బలమైన అభ్యర్థులు ఉండటం వల్ల అక్కడినుండి పోటీ చేయాల్సి వచ్చిందని అన్నారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా తాను అనుకున్న అభ్యర్థులే పోటీలో నిలిచినట్టు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపి బలం పుంజుకుందని అన్నారు. 2019 ఎంపీ ఎన్నికలలో 93000 ఓట్ల మెజారిటీతో గెలుపొందాను అని, ఇప్పుడు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు లక్షల 70 వేల ఓట్లు 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో బిజెపికి ఓట్లు వచ్చినట్టుతెలిపారు. దీంతో ఏడు సెగ్మెంట్లలో బిజెపి మరింత పుంజుకుందని, అదేవిధంగా నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ సెగ్మెంట్లలో బిజెపి పార్టీ అభ్యర్థులే గెలుపొందారని అన్నారు. బిజెపి కార్యకర్తలు నాయకులు ఎటువంటి ఇబ్బంది పడవద్దని మన బలం మరింత పెరిగిందని, డబ్బులు పంపిణీ చేయలేదని, ఈ ఎన్నికలలో పంపిణీ చేస్తే రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలలో వారు డబ్బులు పంపిణీ చేసేవిధంగా అభ్యర్థుల వద్ద డబ్బులు ఉండకపోవచ్చు అని, ఎప్పుడు డబ్బులకు పంపిణీ కార్యక్రమం మంచిది కాదని అన్నారు. 2009 ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ నుండే పోటీ చేసే వాడిని అని, నాకు కాంగ్రెస్ పైన అభిమానం లేదు, కార్యకర్తలు లాగా నాకు మోడీపైనే అభిమానం ఉందని అన్నారు.

ప్రతి గర్భిణి అంగన్‌వాడీలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ప్రతి గర్భిణీ స్త్రీ అంగన్ వాడి కేంద్రంలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న కోడిగుడ్లు, పాలు వారి పౌష్టిక ఆహారం, తీసుకోవాలని, గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవానికి రావాలని అన్నారు. సాధారణ ప్రసవం వల్ల కలిగే లాభాలను మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై. శంకర్ వివరించారు. ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలతో. సాధారణ ప్రసవమైన మహిళలతో సమావేశన్ని ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి గర్భిణీ స్త్రీ అంగన్ వాడి కేంద్రంలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న కోడిగుడ్లు, పాలు, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవానికి రావాలని సూచించారు. సాధారణ ప్రసవం వలన కలిగే లాభాలు వివరించారు. గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం అయిన ఒక బాలింతతో ఆమెకు కలిగినటువంటి అనుభవాలను వివరించారు. సాధారణ ప్రసవం జరిగితే తొందరగా కోలుకునే అవకాశం ఉంటుందని, ఖర్చు ఉండదని, తొందరగా ఆరోగ్యవంతంగా తయారవుతారని, రక్తం అధికంగా నష్టపోవడం ఉండదని తెలిపారు. తర్వాత జరిగే ప్రసవాలకు కూడా సుఖవంతంగా ఉంటుందని పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యవంతంగా పుడతారని వారికి వివరించారు. సాధారణ ప్రసవం అయినప్పుడు తల్లి దగ్గరికి బిడ్డని తొందరగా చేర్చడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముర్రుపాలు తొందరగా బిడ్డకు అందే అవకాశం ఉంటుందని అన్నారు. ముర్రుపాలు పట్టకపోవడంవల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని వివరించారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాల్లోపు నమోదు చేయడం ద్వారా మూడు నెలల గర్భిణి స్త్రీ నుండి తొమ్మిది నెల గర్భిణీ స్త్రీ వరకు మధ్య సమయం ఆరు నెలలు ఉంటుంది కాబట్టి వారికి తగినంత రక్తాన్ని వృద్ధి చెందించే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ మునగాకు, కరివేపాకు, బెల్లం, నువ్వులు, పల్లీలు, లాంటి ఆహారపదార్థాలు తీసుకోవాలని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, క్యారెట్, బీట్రూట్ లాంటివి అధికంగా తీసుకోవాలని తెలిపారు కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శారద, ఇందిద, ఎంఎల్‌హెచ్‌పి. సంతోషి, ఆనంద్, అంగన్వాడి టీచర్ గంగామణి, ఆశా కార్యకర్తలు సుష్మ, గంగలక్ష్మి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి వై. శంకర్

సేంద్రియ కర్బనమే సేద్యానికి ప్రాణం

- సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్కి రత్నాకర్



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్

నవతెలంగాణ-సదాశివనగర్
భూమి ఆరోగ్యానికి సేంద్రియ కర్బనం ఒక ముఖ్య సూచిక అని, సేంద్రియ కర్బనాన్ని పెంచుకునేందుకు అనేక మార్గాలున్నాయని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్కి రత్నాకర్ అన్నారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా భూసారం కాలక్రమేణా తగ్గిందని, ప్రస్తుతం భూమి పంటలు పండించే శక్తిని పూర్తిగా కోల్పోయే స్థితికి చేరిందని వివరించారు. పశువుల ఎరువులు, ఇతర సేంద్రియ ఎరువులు వాడకపోవడం, కేవలం రసాయనిక ఎరువులకే పరిమితం కావడం పరిస్థితికి కారణమని తెలిపారు. సేంద్రియ కర్బనం తక్కువైతే రైతుకు ఇబ్బందులేనని వివరించారు. సేంద్రియ కర్బనం 0.5 శాతం కంటే తక్కువ ఉంటే పంటల ఎదుగుదల, దిగుబడులు ఆశించినంతగా ఉండవని వివరించారు. అలాంటి నేలల్లో పంట దిగుబడులు పెంచాలంటే రైతులు సేంద్రీయ ఎరువుల సహాయం తప్పనిసరని తెలిపారు. వాతావరణ వ్యత్యాసాల వల్ల పంట దిగుబడులు ఆశించినంతగా ఉండటం లేదని, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా సేంద్రియ కర్బనాన్ని పెంచవచ్చునని చెప్పారు. పంటల దిగుబడి పెంచడానికి, అధిక మోతాదులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటం సర్వసాధారణం అయ్యిందన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మెన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షించి ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకొని సరైన పోషకాలు అందిస్తే మంచి దిగుబడి పొందవచ్చునని తెలియజేశారు. అడస్క కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ కృష్ణారావు మాట్లాడుతూ.. పైర్లకు పోషకాలు అందించడంలో సమతుల్యత పాటించకపోవడం వల్ల నేల ఆరోగ్యం, ఉత్పాదకత తగ్గిపోవడం జరుగుతుందన్నారు. అంతే కాక రైతులు పురుగులను, తెగుళ్ళను, పోషక మూలకాల లోప లక్షణాలను గుర్తించడంలో సరైన అవగాహన లేక సస్యరక్షణ మందులను విచక్షణారహితంగా వాడటం వల్ల పండించిన పంటల్లో అధిక మోతాదులో రసాయన అవశేషాలు ఉండటం, మిత్ర జీవులు నశించిపోవడం, పర్యావరణ కాలుష్యం వంటివి వాటిల్లడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి చంద్ర మోహన్, మాజీ సర్పంచ్ సుదర్శన్, బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, డైరెక్టర్ భాస్కర్, రైతులు చెట్కూరి రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల గంగరాజం, అశోక్, ఆస నర్సింలు, తెనుగు సుధాకర్, కుమ్మరి రాజయ్య, లింబాయల శ్రీనివాస్ రెడ్డి, ఆస రాజు, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.